ప్రజారోగ్య రంగాన్ని దెబ్బతీస్తున్న కూటమి ప్రభుత్వం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ
- 38, 40, 47 డివిజన్‌ల కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ప్రజారోగ్య రంగాన్ని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పశ్చిమ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సూచనలతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం 38వ డివిజన్ పరిధిలోని విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రతి జిల్లాకు ఒక బోధనాసుపత్రి ఉండాలన్న సంకల్పంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తూ తమ బినామీలకు దారాదత్తం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజల ఆస్తులు ఎప్పటికీ వారికే చెందాలన్నది జగనన్న ఆకాంక్ష అని తెలిపారు. ప్రతి పౌరుడు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై అవగాహన పెంచుకోవల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, డీజీపీ కెనడి, పొదిలి చంటిబాబు, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, గోమతోటి వినోద్, మంటి రాము, పితాని వెంకట్రావు, కర్రె రమేష్, ఎస్ఎంఎస్ బషీర్, ఆర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



40వ డివిజన్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఆంజనేయరెడ్డి



38వ డివిజన్‌లో సంతకాలు చేస్తున్న ప్రజలు



47వ డివిజన్‌లో సంతకాలు చేస్తున్న ప్రజలు

47వ డివిజన్ పరిధిలోని టీనర్‌పేటలో..

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు సిద్ధమైన కూటమి ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం 47వ డివిజన్ పరిధిలోని టీనర్‌పేట అడ్డరోడ్‌లో నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నాగ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో 110వ నంబర్ బూత్ కన్వీనర్ రెడపంగు క్రాంతికుమార్, బోయళ్ల రాజేష్, షేక్ జాకీర్, షేక్ జబ్బార్ తదితరులు పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేశారు.

40వ డివిజన్ స్వాతీ రోడ్‌లో..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భవానీపురం స్వాతీ థియేటర్ రోడ్‌లో 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్వర్ణయుగంగా ఉన్న వైద్య రంగాన్ని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేసిందని విమర్శించారు. విద్య, వైద్య రంగాలను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ ఆవశ్యకతపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమిఘాట్‌లో జరుగుతున్న గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌లో ప్రతి రోజూ లక్కీడిప్ డ్రా తీసి బహుమతులు ప్రదానం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం రాత్రి లక్కీ డిప్ విజేతలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ బహుమతులు అందజేశారు. జీఎస్టీ సంస్కరణల ఫలితంగా అనేక వస్తువులపై ధరలు తగ్గిన క్రమంలో పున్నమి ఘాట్‌లో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజలు వచ్చి షాపింగ్ చేయటం ద్వారా లక్కీ డ్రాలో బహుమతులు కూడా గెలుచుకుంటున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి పెంచుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి పెంచుకోవాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి అన్నారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం 'ఆహార భద్రత- మిద్దె, పెరటి తోటల ప్రాముఖ్యత' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భం ముఖ్యఅతిథిగా హాజరైన చిరంజీవి చౌదరి మాట్లాడుతూ ప్రతి వారు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ తినే కూరగాయలు, ఆకు కూరలు తామే పండించుకోవాలన్నారు. దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరగాలన్నారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ వీఎస్ ధర్మజ మాట్లాడుతూ మొక్కలు పెంచటంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించవలసిన మెలకువలు, గ్రాఫ్టెడ్ మొక్కల గురించి ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు వక్కలగడ్డ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు, ఆడపడుచు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఓ యువతి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. భవానీపురానికి చెందిన యువతి బీటెక్ పూర్తి చేసి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తోంది. అక్కడ కలకత్తాకు చెందిన యువకుడు పరిచయమయ్యాడు. ఇద్దరూ ప్రేమ వివాహాన్ని పెద్దలను ఒప్పించి చేసుకున్నారు. వివాహ సమయంలో అత్తామామలు, ఆడపడుచు కట్న కానుకలు డిమాండ్ చేయగా యువతి తల్లిదండ్రులు అప్పు చేసి రూ.50 లక్షలు, బంగారం, వెండి కానుకలుగా ఇచ్చారు. కొన్నాళ్లు ఇద్దరి కాపురం బాగానే సాగింది. ఆ తర్వాత భర్త, అత్తమామలు, ఆడపడుచు అదనపు కట్నం తేవాలంటూ ఆమెను మానసికంగా వేధింపులకు గురిచేశారు. వేధింపులు తాళలేక యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన జాతీయ రహదారిపై నల్లకుంట వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నున్న గ్రామానికి చెందిన జగదీష్‌బాబు ప్రైవేటు కంపెనీలో మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం స్నేహితుడు స్టాలిన్‌తో కలిసి బైక్‌పై తుళ్లూరు బయలుదేరారు. గొల్లపూడి జాతీయ రహదారిపై నల్లకుంట వద్ద వెస్ట్‌బైపాస్ దిగి సర్వీసు రోడ్డులోకి వెళుతుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళుతున్న జగదీష్ బాబు, స్టాలిన్‌కు గాయాలయ్యాయి. బైక్ బాగా దెబ్బతింది. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా 108 అంబులెన్స్‌లో హెల్ప్ హాస్పిటల్‌కు తరలించారు. గాయాలపాలైన ఇద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భవానీపురం పోలీసులు క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

సాహితీవేత్త కొల్లూరి మృతి



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన సాహితీవేత్త, ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి(75) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందారు. దాదాపు 50 సంవత్సరాలుగా సాహిత్యరంగంలో ఆయన ఉన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థను స్థాపించి 27 సంవత్సరాలుగా ప్రతి నెలా వెన్నల పేరుతో కవిత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారు. వివిధ రంగాల్లోని ప్రముఖుల సేవలను గుర్తించి వారికి పురస్కారాలను అందజేస్తున్నారు. అంజలి మాసపత్రికను స్థాపించి కొత్తతరం రచయితలకు వేదిక కల్పించారు. లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, అంజలి క్లబ్ ద్వారా సేవా రంగంలో గుర్తింపు తెచ్చుకున్నారు. వివిధ సాంస్కృతిక సంస్థలు కొల్లూరి సేవలను గుర్తించి పురస్కారాలను అందజేశాయి. 2025 సంవత్సరంలో రాష్ట్ర పుభుత్వం ఉగాది పురస్కారం అందజేసింది.

బాబా మందిరానికి వాటర్ కూలర్ వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బాబా భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఆంధ్రా షిరిడీ ముత్యాలంపాడు సాయిబాబా మందిరానికి గురువారం దాత సత్యనారాయణపురం దుర్గా డిపార్ట్‌మెంట్ స్టోర్స్ అధినేత రామాంజనేయులు రూ. 35వేలు విలువ చేసే కూలర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిరంలో ఆధ్యాత్మిక సేవలతో పాటు సేవాకార్యక్రమాలు నిర్వహించటం తనను ఆకట్టుకుందని చెప్పారు. తన వంతు బాధ్యతగా కూలర్ అందజేస్తున్నట్లు తెలిపారు. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ మందిరం తలపెట్టిన ఏ కార్యక్రమం అయినా దానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. భక్తులు దాతల మనోభావాలకు అనుగుణంగా మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దాతకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న షేక్ అష్రఫ్‌అలీ

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ నిపుణుడు డాక్టర్ షేక్ అష్రఫ్‌అలీ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈసీ, ఐఐసీ, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ టెస్టింగ్‌లో తాజా ధోరణులు, సాంకేతికతలు అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా నూతన సాంకేతికత పరుగులు తీస్తుందన్నారు. విద్యార్థులు తమతమ రంగాల్లో చోటు చేసుకున్న ప్రగతిని తెలుసుకుని దానిపై పట్టు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమతమ రంగాల్లోనూ నూతన ఆవిష్కరణలను గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఎ.బాలకృష్ణ, అధ్యాపకులు కె.తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నూతన దస్తులు పంపిణీ



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): దీపావళి పండుగ సందర్భంగా శానిటేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు సాయి శానిటేషన్ సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నూతన దుస్తులను పంపిణీ చేశారు. గురువారం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షులు పంచానంద్ చేతుల మీదుగా 250 మంది కార్మికులకు దుస్తులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం కోసం తమ ఆర్గనైజేషన్ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాద్‌లలోనూ కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. ఆర్గనైజేషన్ సెక్రటరీ మున్నిదేవి, సభ్యులు రేఖ దేవి, టి.వెంకటశ్రీను, దీపక్ పాల్గొన్నారు.

కాపర్ వైర్ బాక్సులు మాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గోడౌన్‌లో కాపర్ వైర్ బాక్సులు మాయమైన ఘటన గొల్లపూడి పంటకాలువ రోడ్డులోని గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పంట కాలువ రోడ్డులోని గోల్డ్‌మెడల్ గోడౌన్‌లో ఓపెన్ ప్లేస్‌లో ఉంచిన 210 కార్టన్ల కాపర్ వైర్ బాక్సులు అదృశ్యమయ్యాయి. గోల్డ్ మెడల్ ఏరియా సేల్స్ మేనేజర్ ముఖేష్ జైన్ సెప్టెంబర్ 21వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో గౌడౌన్ తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు చూడగా గోడౌన్ ఓపెన్ స్పేస్‌లో ఉంచిన కాపర్‌వైర్ బాక్సులు కనిపించలేదు. గౌడోన్‌తోపాటు చుట్టుపక్కల వెతికినా బాక్సులు దొరకలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారన్న అనుమానంతో సేల్స్ మేనేజర్ ముఖేష్ జైన్ భవానీపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొట్లాట కేసులో నిందితులకు జైలు శిక్ష

విజయవాడలీగల్: కొట్లాట కేసులో నిందితులపై నేరం రుజువైనందున 1వ అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.కరీముల్లా నిందితులకు ఒక్కొక్కరికి 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్.ఆర్.ఆర్. కళాశాల సమీపంలో నీళ్లు పట్టుకునే విషయంలో మహిళల మధ్య ఘర్షణ జరిగింది. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.సత్యవాణి, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, మాచవరం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రకాష్ పర్యవేక్షణలో ఏడుగురు సాక్షులను విచారించారు. అనంతరం నిందితులైన వడ్డాది పద్మ, వడ్డాది ఏడుకొండలు, పాటిబండ్ల చిన్నమ్మలపై నేరం రుజువైనందున గురువారం న్యాయమూర్తి ఎం.ఎస్.కరీముల్లా పై విధంగా తీర్పు ఇచ్చారు.

మార్కెట్‌లోకి ది ఆల్ న్యూ గ్రాండ్ 'విక్టోరిస్'



విక్టోరిస్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం రాఘవరావు

పెనమలూరు: కానూరు సంతోష్ మారుతీ సుజుకీ షోరూమ్‌లో గురువారం మారుతీ సుజుకీ విక్టోరిస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. గొల్లపూడి కమర్షియల్ మార్కెట్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ఎస్‌బీఐ ఆర్ఎం రాచపూడి రాఘవరావు విక్టోరిస్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఆర్ఎం రాఘవరావు మాట్లాడుతూ.. వినియోగదారుల కోసం విక్టోరిస్‌కు ఎస్‌బీఐ 100 శాతం ఆన్‌రోడ్ ఫండింగ్ ఫైనాన్స్ సదుపాయం కల్పిస్తుందన్నారు. సంతోష్ మారుతీ సుజుకీ షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విక్టోరిస్ మూడు వేరియంట్‌లలో ఉందన్నారు. హైబ్రీడ్, స్మార్ట్ హైబ్రీడ్, సీఎన్‌జీలు బుకింగ్‌లు చేసుకోవచ్చని వివరించారు. సంతోష్ మారుతీ సీవో జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. భారత్ ఎన్‌కాప్ రేటింగ్‌లో 5 స్టార్ వచ్చిందని, తమ వద్ద ఇప్పటికీ 100కు పైగా కార్లు బుకింగ్స్ వచ్చాయని, డెలివరీ ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ఎక్స్‌పర్ట్ సైకాలజిస్టుల కమిటీ



జిల్లా కలెక్టర్ లక్ష్మీశాతో సైకాలజిస్టులు డాక్టర్ గర్రే శంకరరావు, డాక్టర్ టీఎస్‌రావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజలకు మానసిక సమస్యలపై ఉచితంగా సేవలు అందించేందుకు ఎక్స్‌పర్ట్ సైకాలజిస్ట్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఏపీ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ గర్రే శంకరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశాను కలిసి పలు అంశాలపై చర్చించి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కమిటీ ద్వారా అర్హత కలిగిన సైకాలజిస్టులు స్వచ్ఛందంగా తమ వృత్తి నైపుణ్యాలను వినియోగించి మానసిక ఆరోగ్య అవగాహనను పెంపొందించడం, సమాజంలో ప్రధానమైన మానసిక-సామాజిక సమస్యలను పరిష్కరించడానికి సేవలందించనున్నారు. ఒత్తిడి నియంత్రణ , కుటుంబ కౌన్సెలింగ్, ఆత్మహత్య నిరోధక చర్యలు, విద్యార్థుల సమూహ చర్చలు, ప్రేరణాత్మక - వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, కేరీర్ కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అంతేకాక అధ్యయన నైపుణ్యాలు - పరీక్షా ఒత్తిడి నియంత్రణ, యువత ప్రవర్తనా సమస్యలు, ఈవ్ టీజింగ్ నిర్మూలన, ప్రేమ సంబంధాలపై మార్గదర్శనం చేస్తామన్నారు. మొబైల్ మానియా (అభ్యాస వ్యసనం) నివారణ, జీవన నైపుణ్యాల శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సంక్షేమం, యువత మార్గదర్శక కార్యక్రమాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డాక్టర్ టీఎస్‌రావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న వెలంపల్లి, షేక్ బాషి



గ్యార్మీ వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ ఇర్ఫాన్

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): మహబూబ్ సుభాని జెండా చెట్టు దర్గా వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో హజ్రత్ మహబూబ్ సుభాని గ్యార్మీ దావత్ కార్యక్రమం వించిపేటలోని జెండా చెట్టు దగ్గర గురువారం రాత్రి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని దావత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెలంపల్లి మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా జెండా చెట్టు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గ్యార్మీ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏటా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు షేక్ బాషి తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ తమీం అన్సారి, ట్రెజరర్ బాలరాజు వెంకట రమేష్, నాయకులు అతీక్ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడ పశ్చిమ): భవానీపురం 41వ డివిజన్ పరిధిలోని రంగూన్ సాహెబ్ వీధిలో గౌసుల్వార్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మీ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి జెండాల ఊరేగింపు చేశారు. వేడుకల్లో పాల్గొన్న 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలు దైవంగా భావించే మహమ్మద్ ప్రవక్త బోధించిన సన్మార్గంలో నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు కలీం భాయ్, భక్షు భాయ్, గౌస్, బడే ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 25న భగవద్గీత పోటీలు

విజయవాడ కల్చరల్: గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నవంబరు 25న భగవద్గీత పోటీలు నిర్వహిస్తునట్లు ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెట్ ఎం.కాంతికుమార్ తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోటీల్లో ఉచితంగా పాల్గొనవచ్చని చెప్పారు. 6 నుంచి 9 వ తరగతి వరకు గుణత్రయ విభాగం అధ్యాయంలో, 10 తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు దైవాసుర సంపద్విభాగ యోగ అధ్యాయంలో, 18 నుంచి 45 సంవత్సరాల వరకు నిత్యజీవితంలో భగవద్గీత అంశంగా మాట్లాడాల్సి ఉంటుందని చెప్పారు. గాంధీనగర్‌లోని చిట్టూరి స్కూల్లో పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 7032255499 నంబరులో సంప్రదించాలని ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ సూచించారు. సమావేశంలో ధర్మప్రచార పరిషత్ సభ్యులు బొగ్గవరపు బాలకోటేశ్వరారవు, బొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, నండూరి తాండవకృష్ణ, వల్లావరపు వెంకటబాబు, మంగిపూడి వెంకట శాస్త్రి, వెంకట సత్యదుర్గాంబ, శ్రీనివాస్, శోభన్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం బలోపేతమయ్యేలా పనిచేయాలి



సదస్సులో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు):ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా ఎన్నికల కమిషన్ కృషి చేయాలని, కానీ ప్రస్తుతం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) వ్యవస్థాపకుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక కోర్ కమిటీ సభ్యుడు వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారత ఎన్నికల సంఘం పనితీరు అనే అంశంపై జిల్లా స్థాయి ప్రజా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నికల కమిషనర్ రాజ్యాంగా బద్ధంగా వ్యవహరించే వారని, అలాంటి వారిలో టి.ఎన్.శేషన్ ఒకరన్నారు. కమిషనర్‌ను ముగ్గురు కమిటీ సభ్యులు నియమించే విధంగా చట్టం చేయాలని 2023లో సుప్రీంకోర్టు తెలిపిందని, ఆ ముగ్గురిలో ప్రధాని, ప్రతిపక్ష పార్టీ నేత, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉండాలన్నారు. అయితే 2024లో కమిటీ వేస్తూ సుప్రీంకోర్టు జడ్జికి బదులు అధికారంలో ఉన్న కేంద్ర క్యాబినెట్ మంత్రిని కమిటీలో చేర్చి చట్టం చేశారన్నారు. దీంతో ఎన్నికల సంఘంపై అనేక అపోహలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు. వాటిని ప్రజలకు తెలియజేసి చైతన్య పరిచే విధంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక పని చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ఈ సదస్సులో పర్యావరణ పరిరక్షణ వేదిక కోర్ కమిటీ సభ్యులు పి.సురేంద్రబాబు, పి.సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామవరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కె.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వాంబే కాలనీలో నీటి పరీక్షలు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో వీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరా రంగు మారి రావడంపై సాక్షి దినపత్రికలో గురువారం కలుషిత నీరు తాగేదెలా సారూ! శీర్షికతో ప్రచురితమైన కథనానికి వీఎంసీ అధికారులు స్పందించారు. వాంబే కాలనీలో స్థానికుల సమక్షంలో క్లోరిన్ టెస్ట్ నిర్వహించారు. ఆయిల్ టెస్టింగ్‌లో నీరు ఎల్లో రంగు రావడంతో నీటిలో ఎలాంటి తేడా లేదని ఏఈ సతీష్ తెలిపారు. నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగాలని సూచించారు.



స్కిట్‌లు, డ్యాన్స్‌లతో వైద్యుల నిరసన



తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల్లోని వైద్యులు ఆందోళన బాట పట్టారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో వారి ఆందోళనలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేవలం దీక్షా శిబిరంలో మాత్రమే కాక, జనసమ్మర్ధం అధికంగా ఉండే మాల్స్‌లోనూ ఫ్లాష్ మాబ్‌లు నిర్వహిస్తూ తమ ఆవేదనను స్కిట్‌లు, పాటల రూపంతో ప్రజలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం విజయవాడ బెంజిసర్కిల్ వద్ద నున్న ట్రెండ్ సెట్‌మాల్‌లో యువ వైద్యులు వినూత్నంగా నిరసన తెలిపారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, విజయవాడ

19న ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధనా మహోత్సవం

విజయవాడ కల్చరల్: సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత మూర్తిత్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధనా సంగీత్సవ కార్యక్రమాన్ని 19 వ తేదీ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు సంగీత సమితి కార్యదర్శి సీవీరావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు గానం చేస్తారని తెలిపారు.

సన్నాల మృతి తీరని లోటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ చిత్రకారులు, ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, ఎం.ఎస్. మూర్తి లలిత కళా గ్యాలరీ ఉపాధ్యక్షుడు సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ మృతి చిత్ర కళారంగానికి తీరని లోటు అని ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కార్యదర్శి ఎం.వి. సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1972 నుంచి ఇప్పటి వరకూ 53 సంవత్సరాలుగా ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ద్వారా అనేక హోదాల్లో ఆయన కళాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన గీసిన చిత్రాలు అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో దర్శనమిస్తూ ఉంటాయని చెప్పారు. ఆయన భౌతికంగా లేకున్నప్పటికీ ఆయన గీసిన చిత్రాల ద్వారా ప్రతి ఒక్కరి హృదయంలో నిలిచే ఉంటారని తెలిపారు.